ఆర్‌జియుకెటి నూజివీడులో సర్టిఫికెట్ల ధ్రువీకరణ

నూజివీడు టౌన్ :ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో 2025-06 అడ్మిషన్లకు సంబంధించి క్రీడలు, క్యాప్, ఎన్‌సిసి, బిఎస్‌జి కోటాలకు చెందిన అభ్యర్థుల సర్టిఫికెట్ల ధ్రువీకరణ రెండో రోజు గురువారం కొనసాగింది. నాలుగు రోజుల పాటు సర్టిఫికెట్ ధ్రువీకరణ కార్యక్రమం జరగనుంది. సర్టిఫికెట్ల ధ్రువీకరణకు క్రీడల కోటాలో 245 మందికి 171 మంది అభ్యర్థులు హాజరయ్యారు. క్యాప్ కోటాలో 117 మందికి 79 మంది అభ్యర్థులు, ఎన్‌సిసి క్యాటగిరీకి 341 మంది 277 మంది, బిఎస్‌జి క్యాటగిరీకి 247 మంది 185 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్, ఆర్‌జియుకెటి అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్ర, ప్రొఫెసర్ గోపాలరావు పర్యవేక్షించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ అర్జునరావు, ఇతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ధ్రువీకరణ ప్రక్రియను సవ్యవంతంగా నిర్వహించేందుకు విద్యాసంస్థ అన్ని ఏర్పాట్లు చేసింది. రానున్న రెండు రోజుల్లో ఇతర కేటగిరీలకు చెందిన అభ్యర్థుల సర్టిఫికెట్ల ధ్రువీకరణ జరగనుంది.

ఉపాధి పనులపై ఎంపిడిఒల నిర్లక్ష్యం..!

ప్రోగ్రామింగ్ అధికారిగా ఎంపిడిఒదే ప్రధాన బాధ్యత
తమకు సంబంధం లేదన్నట్లు సదరు అధికారుల తీరు
ఉపాధి శ్రామికుల మస్టర్ల నమోదులో తీవ్రమైన అవినీతి ఆరోపణలు
పనుల కల్పన, పూర్తి వేతనాల అమలుపై కనీసం పట్టని ఎంపిడిఒలు
రెండు జిల్లాల్లో 5.50 లక్షలు జాబ్‌కార్డులు

'నూజివీడు మండలంలో ఒకే వ్యక్తి ఫోటోను అనేకసార్లు వాడుతూ మస్టర్ల నమోదులో అవినీతి జరిగినట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులొస్తే తప్ప పట్టించుకునే నాథుడే లేడు. జిల్లా అధికారులు విజిలెన్స్ అధికారిని నియమించి విచారణ చేయించి వాస్తవాలు నిగ్గు తేల్చేసరికి దిగారు.'

'ఎంతసేపు పని చేసినా తమకు రూ.250 లోపే వేతనం వస్తుందని ఉపాధి శ్రామికులు గగ్గోలు పెడుతున్నారు. ఉపాధి వేతనం తక్కువ వస్తున్నప్పుడు ఎంపిడిఒలు జోక్యం చేసుకుని క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకుని వేతనం పెరిగేలా చర్యలు తీసుకుని ఉపాధి శ్రామికులు మేలు జరిగేలా చూడాల్సి ఉన్నా.. ఏఒక్క మండలంలోనూ పట్టించుకున్న దాఖలాలేవు.'

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధి హామీ చట్టం అమల్లో ప్రోగ్రామింగ్ అధికారిగా ప్రధాన బాధ్యత నిర్వహించాల్సిన మండల పరిషత్ అధికారులు (ఎంపిడిఒలు) కనీసం పట్టించుకోని పరిస్థితి. చట్టంలో ఉన్న నిబంధనలు సైతం అమలుకు చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఏలూరు జిల్లాలో 3.73 లక్షలు, పశ్చిమగోదావరి జిల్లాలో 1.80 లక్షల వరకూ ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. లక్షల సంఖ్యలో ఉన్న ఉపాధి శ్రామికులకు నిబంధనల ప్రకారం పని కల్పించడం, ప్రభుత్వం నిర్ణయించిన వేతనం (కూలి) అందేలా చూడటంలో ఎంపిడిఒదే కీలక బాధ్యత. ఉపాధి హామీ పనుల పర్యవేక్షణకు సంబంధించి మండలస్థాయిలో ఎపిఒ, గ్రామస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేస్తారు. వీరిద్దరిని సరైన పద్ధతిలో నడిపించి ఉపాధి శ్రామికులకు పని కల్పించడంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎంపిడిఒదే. రెండు జిల్లాల్లోనూ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా సాగుతోంది. ఎంపిడిఒలు ఉపాధి హామీ చట్టం అమలులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గతేడాది

2024-25కు సంబంధించి ఉపాధి శ్రామికులకు రోజువారీ వేతనం ప్రభుత్వం రూ.300గా నిర్ణయించింది. ఏలూరు జిల్లావ్యాప్తంగా సరాసరిన ఏడాది మొత్తంగా ఉపాధి శ్రామికులకు అందిన వేతనం రూ.253గా అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ వేతనం సరాసరిన అందినది మాత్రమే. చాలామంది శ్రామికులకు రూ.200 లోపు వేతనం అందిన రోజులు చాలానే ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రూ.200లోపు వేతనంతో ఏవిధంగా జీవనం సాగించాలో అధికారులు చెబితేనే బాగుంటుంది. ఉపాధి పనులకు సంబంధించిన ప్రణాళిక, వేతనం పూర్తిస్థాయిలో అందేవిధంగా ఎంపిడిఒలు బాధ్యత తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఎపిఒ, ఫీల్డ్ అసిస్టెంట్లు ఏది చెబితే అదేనన్నట్లు ఎంపిడిఒలు తలాడిస్తున్న పరిస్థితి ఉంది. వేతనం ఎందుకు తక్కువగా వస్తుందో ఎపిఒ, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపిడిఒలు కనీసం మాట్లాడని పరిస్థితి ఉంటోంది. ప్రతియేటా ఇదే విధంగా జరుగుతోంది. వేతనం తక్కువగా వస్తుండటంతో చాలామంది ఇతర పనులకు వెళ్లే పరిస్థితి నెలకొంటుంది. పనికి రావడం లేదని మరోవిధంగా అధికారులు ప్రచారం చేస్తున్న పరిస్థితి ఉంటోంది. ఎంపిడిఒల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి శ్రామికులు తీవ్రంగా నష్టపోతున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి శ్రామికులకు వేతనం రూ.307గా నిర్ణయించారు. శ్రామికులకు పూర్తిస్థాయిలో వేతనం అందేలా మండలాధికారులు సరైన ప్రయత్నం చేయడం లేదు. జిల్లా అధికారులు ఒత్తిడి తెస్తేనే కొంతమేర చేస్తున్నారు. మండలస్థాయిలో మాత్రం దీనిపై ప్రణాళికాబద్ధంగా పని జరగని పరిస్థితి కన్పిస్తోంది. ఉపాధి హామీ చట్టం అమలుపై జిల్లా కలెక్టర్లు పూర్తిస్థాయిలో జోక్యం చేసుకుని ఎంపిడిఒల పని తీరుపై సమీక్ష జరిపితే తప్ప ఉపాధి శ్రామికులకు న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు.

మస్టర్లపై తీవ్ర ఆరోపణలు

ఉపాధి హామీ పనుల్లో అత్యధికంగా మస్టర్లకు సంబంధించిన అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి ఏఒక్క మండలం అతీతం కాదనే చెప్పొచ్చు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఇంటి దగ్గర ఉన్న వారికి సైతం మస్టర్లు వేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ నాయకుల జోక్యంతో ఫీల్డ్ అసిస్టెంట్లు అనేక తప్పులు చేస్తున్నట్లు స్పష్టంగా బయటపడుతున్నాయి. మస్టర్లతోపాటు ఇతర ఉపాధి పనుల్లో సమస్యలు ఏవైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వచ్చే వరకూ ఎంపిడిఒలు పట్టించుకోవడం లేదు. ఉపాధి పనులకు సంబంధించి నిరంతరం ఎంపిడిఒలు పర్యవేక్షణ జరపడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. ఎంపిడిఒల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి శ్రామికులకు తీరని నష్టం ఏర్పడుతోంది.

ఎల్లాపురంవాసికి కరోనా

ఏలూరు ఆసుపత్రిలో చికిత్స

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని ఎల్లాపురం వాసికి కరోనా సోకింది. గ్రామానికి చెందిన భార్య, భర్తలు ఇరువురికి రెండు రోజులుగా జ్వరం రావడంతో స్థానికంగా చికిత్స చేయించుకున్నారు. అయితే జ్వరం తగ్గకపోవడంతో వారు ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వెళ్లడంతో వైద్యులు వారికి పరీక్షలు నిర్వహించగా భర్త (52)కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. భార్యకు మాత్రం నెగెటివ్ వచ్చింది. వారిద్దరినీ వేర్వేరు వార్డుల్లో ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. దీంతో ఆ గ్రామాధికారులు అప్రమత్తమయ్యారు. ఆ వ్యక్తి ఇంటి పరిసరాల్లో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. చుట్టు పక్కల వారికి ఎవరికైనా జ్వరం, అనారోగ్యం ఏమైనా ఉందని వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించారు.

చదివిన పాఠశాలకే హెచ్‌ఎంగా..!

తోట పోతురాజు ఘనత

ప్రజాశక్తి - ఉంగుటూరు

తాను చదివిన పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేసే అరుదైన ఘనత చేబ్రోలుకు చెందిన తోట పోతురాజుకే దక్కింది. ఉంగుటూరు మండలం నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరతగతి వరకు చదివిన (1988-89 టెన్త్ బ్యాచ్) పూర్వ విద్యార్థి పోతురాజు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆకివీడు నుంచి నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా వచ్చారు. ఆయన తొలి ఉద్యోగం నిడమర్రు మండలం గుణపర్రు. అక్కడ నుంచి పత్తేపురం, పెదనింద్రకొలను, కైకరం, ఎంఎంపురం పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా పని చేసి హెడ్‌మాస్టర్‌గా 2023లో ఉద్యోగోన్నతిపై పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు జెడ్‌పి హైస్కూల్‌కు వెళ్లారు. అక్కడ నుంచి సాధారణ బదిలీల్లో నారాయణపురం జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎంగా బదిలీ అయ్యారు. తాను చదివిన పాఠశాలలో హెడ్‌మాస్టర్‌గా పనిచేసే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని పోతురాజు అన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపర్చి, క్రమశిక్షణతో కూడి విద్యను అందించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గతంలోనే ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులుగా పని చేశారు.

అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో సమస్యలపై పోరు

నర్రా ఆంజనేయులు వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - పెదపాడు



పెదపాడు : నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపు నిచ్చారు. పెదపాడులో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, అమరవీరుడు నర్రా ఆంజనేయులు 75వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా ఆంజనేయులు చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎ.రవి మాట్లాడుతూ నర్రా ఆంజనేయులు ఉన్నత చదువులు చదువు కుని పీడిత ప్రజల కోసం పని చేశారని, ఆయన ప్రాణ త్యాగం తరతరాలకు గుర్తుండిపోతుందన్నారు. నాటి కమ్యూని స్టుల త్యాగాల ఫలితమే అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గం చూపాయన్నారు. నేడు డబ్బు రాజకీయాలు నడుస్తున్నాయని, అయినా కమ్యూని స్టులు అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. దేశం, రాష్ట్ర అభివృద్ధి కోసం సిపిఎం, వామపక్షాలు చేస్తున్న ఉద్యమాలను అందరూ బలపరచాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలపై భారాలు వేయకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, గ్రామ నాయకులు షేక్ కరీముల్లా, షేక్ షఫీరా, గారపాటి రాజా పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ప్రజల కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరులు నర్రా ఆంజనేయులు, బూరాడ అప్పారావు, తాన్న సింహాచలం చిరస్మరణీయులని సిపిఎం నగర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. స్థానిక చొడిదిబ్బ నర్రా గ్రంథాలయం వద్ద అమరవీరుల వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 1950 సంవత్సరం కాలంలోనే ప్రజల కోసం పోరాడి నర్రా ఆంజనేయులు పోలీస్ కాల్పులకు బలయ్యారన్నారు. బురాడ అప్పారావు, తాన్న సింహాచలం ఏలూరు నగరంలో ప్రజా సమస్యలపై పోరాడుతూ సంఘ విద్రోహశక్తుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయారన్నారు. 70 సంవత్సరాలు గడిచినా వారిని స్మరించుకుంటూ వారి ఆశయాల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆనాటికంటే ఈరోజు దేశంలో అసమానతలు పెరిగిపోతున్నాయని, అసమానవతలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా నాయకులు జి.నరసింహారావు మాట్లాడుతూ కమ్యూనిస్టులు ఎప్పుడూ ప్రజల పక్షాన పోరాటాలు చేస్తారని, చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశ సమైక్యత కోసం ప్రజలందరూ కలిసికట్టుగా మతోన్మాదాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.ఇసాక్, కంది విశ్వనాథం, వెంకటేశ్వరరావు, చింతాడ వెంకటలక్ష్మి, పి.ఆదిశేషు, మావూరి శ్రీనివాస్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గాలి

ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణ లక్ష్యాలను సాధించాలి
జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వ్యవసాయాధికారులను ఆదేశించారు. మండలంలోని ద్వారకాతిరుమల, గుండుగొలనుకుంట, సూర్యచంద్రరావుపేట తదితర గ్రామాల్లో ఆమె గురువారం సుడిగాలి పర్యటన చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాల సాగు పద్ధతులను పరిశీలించారు. తొలుత ద్వారకాతిరుమలలో ఫార్మ్ పాండ్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం గుండుగొలనుగుంటలోని శ్రీ సుబ్రహ్మణేశ్వర ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సందర్శించి ఆదర్శ రైతు ఒబిలిశెట్టి గోపాలకృష్ణమూర్తి ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న కాయగూరలు, పండ్ల తోటలను కలెక్టర్ పరిశీలించారు. సాగుకు వినియోగిస్తున్న పంచగవ్య వంటి సేంద్రియ వివరాలను రైతు గోపాలకృష్ణమూర్తిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగం కారణంగా ప్రజలకు రోగాలు వచ్చే అవకాశం ఉందని, సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల వినియోగం కారణంగా ప్రజలకు ఆరోగ్యంతోపాటు జీవితకాలం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న దానికంటే అదనంగా 10 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయంతో పంటల సాగు లక్ష్యాన్ని ఈ సంవత్సరం సాధించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహిస్తున్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకుని మరింత విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేసేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గోపాలకృష్ణమూర్తిని కలెక్టర్ అభినందించారు. అనంతరం సూర్యచంద్రరావుపేటలో బలుసు వీరభద్రయ్య క్షేత్రంలో కొబ్బరి, వక్క, అరటి, మిరియాల సాగును పరిశీలించారు. అరటిలో అంతర పంటగా కోకో పండించడంపై రైతును కలెక్టర్ అభినందించారు. అనంతరం పశుగ్రాసం విత్తనాలను కలెక్టర్ అధికారులతో కలిసి పొలంలో చల్లారు. అనంతరం పొలసానిపల్లిలోని ఎస్‌ఎంఆర్ జీడిపప్పు ప్రాసెసింగ్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ వెంట జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ రమణ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాషా, డ్వామా పీడీ సుబ్బారావు, ఉద్యాన శాఖ డిడి రామ్మోహన్, మైక్రో ఇరిగేషన్ పీడీ రవికుమార్, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటేష్, తహశీల్దార్ సుబ్బారావు, ఎంపిడిఒ ప్రకాష్ పాల్గొన్నారు.

భాస్కరరావు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి
ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - పెదవేగి

ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు అరికట్టాలని, వారు చేసే దౌర్జన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం మండలంలోని కె.కన్నాపురం గ్రామంలో ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యం వేధింపులు తట్టుకోలేక చనిపోయిన భాస్కరరావు కుటుంబాన్ని సంఘం జిల్లా నాయకత్వం, ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. కుటుంబానికి పెద్దదిక్కు భాస్కరరావు చనిపోవడం కుటుంబానికి తీరనిలోటని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, భాస్కరరావు మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్ల దౌర్జన్యంతో భాస్కరరావు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. దీఓంతో అతని కుటుంబం రోడ్డున పడిందని, ఇప్పుడు వారిని ఆదుకునే వారు ఎవరని ప్రశ్నించారు. భాస్కరరావు ఇంటి వద్ద లేని సమయంలో ఇంటిలో ఉన్న సామాన్లు బయటపడేసి, ఇంటిని జప్తు చేస్తామని బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భాస్కరరావుకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, వారిని ఇప్పుడు ఎవరు ఆదుకుంటారని, ఆ కుటుంబానికి ఎవరు భరోసా ఇస్తారని ప్రశ్నించారు. ఇలాంటి ప్రవేట్ ఫైనాన్స్

మృతుని కుటుంబీకులతో మాట్లాడుతున్న నేతలు

కంపెనీల దౌర్జన్యాలను, ఆగడాలను అరికట్టాలని,పోలీస్ అధికారులు ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భాస్కరరావు కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకు గిట్టుబాటు ధర కల్పించాలి

ధర కిలో రూ.10కు తగ్గిపోవడంపై రైతుసంఘం ఆందోళన

ప్రజాశక్తి - దెందులూరు

మాట్లాడుతునర్న రైతు సంఘం నాయకులు

నిమ్మకాయలకు గిట్టుబాటు ధర కల్పించి నిమ్మ రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం రామారావుగూడెంలో నిమ్మ తోటలను పరిశీలించి, నిమ్మకాయలకు వస్తున్న ధరను రైతులను అడిగి తెలుసుకున్నారు. నిమ్మకాయల ధర తగ్గిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్, మే నెలల్లోనే నిమ్మకాయల వినియోగం ఎక్కువగా ఉండి రైతులకు నిమ్మకాయలు అత్యధికంగా ధరలొచ్చే సీజన్‌లో ధర భారీగా పడిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఇదే కాలంలో కిలో నిమ్మకాయలకు రైతుకు రూ.100కుపైగా ధర వచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కిలో నిమ్మకాయలకు రూ.10 నుండి రూ.25 మాత్రమే ధర రావడంతో నిమ్మ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరా నిమ్మ తోటలకు కౌలు రూ.80 వేలకుపైగా ఉందని, పెట్టుబడి ఖర్చులు కూడా రూ.70 వేలకుపైగా అవుతున్నాయని, ప్రస్తుతం వస్తున్న ధరలు కూలీ ఖర్చులకు కూడా సరిపోవడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిమ్మ రైతులకు ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేసి నిమ్మకాయలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిమ్మ రైతుల ఆందోళనకు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ సంఘీభావం ప్రకటించారు. మార్కెట్లో కనీస ధరలు రాక నష్టపోతున్న నిమ్మ రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తోట సీతారామయ్య, ఆర్.జనార్ధనరావు, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తోలకాలు అడ్డగింత

అధికారులు, నాయకుల తీరుపై
గిరిజన యువత ఆగ్రహం

బుట్టాయగూడెం : మట్టి తోలకాలను అడ్డుకున్న గిరిజన యువత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని రెడ్డి గణపవరంలో మట్టి అక్రమ తోలకాలను గిరిజన యువత గురువారం అడ్డుకున్నారు. రెడ్డి గణపవరం శివారులోని టీ స్టాల్ ఎదురుగా ఉన్న ఇటుక బట్టీలకు అధికార పార్టీకి చెందిన వ్యక్తులు అక్రమంగా మట్టి తోలుతున్నారని తెలుసుకున్న గిరజన యువత అడ్డుకున్నారు. మట్టి తోలే స్థలానికి గిరిజన యువత వెళ్లి మట్టి తోలడానికి మీకు ఎటువంటి అనుమతులు ఉన్నాయని ప్రశ్నించారు. దీంతో అధికార పార్టీకి చెందిన వారు ఎవరి అనుమతులు మాకు అవసరం లేదని చెప్పారు. షెడ్యూల్ ప్రాంతంలో మట్టి తరలించడానికి రెవెన్యూ అధికారులు, లేదా మైనింగ్ అధికారుల అనుమతులు ఉండాలని, అధికారంలో ఉన్నామని మట్టిని అక్రమ తోలకాలకు పాల్పడడం అన్యాయమని గిరిజన యువత అధికార పార్టీకి చెందిన వ్యక్తులను నిలదీశారు. అనంతరం స్థానిక తహశీల్దార్ చలపతిరావుకు ఫోన్ చేసి మట్టి తోలడానికి అనుమతులు ఇచ్చారా అని అడగగా తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తహశీల్దార్ చెప్పారు. తహశీల్దార్ రెడ్డి గణపవరం విఆర్‌ఎను మట్టి తోలే ప్రదేశానికి పరిశీలించేందుకు పంపించగా మట్టి తోలకందారులు అక్కడ నుంచి తప్పించుకున్నారు. నిర్వాసిత గ్రామంలోని ఇళ్లకు అని చెప్పి మట్టిని ఇటుక బట్టీలకు అధిక ధరలకు తోలుతున్నారని గిరిజన యువత చెప్పారు. ట్రాక్టర్ ట్రక్కు మట్టి రూ.1300లకు తోలుతున్నారన్నారు. నిర్వాసిత గ్రామాలకు కూడా అదే రేటును నిర్ణయించారని, నిర్వాసిత గ్రామ ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. మట్టి మాఫియాకు కొందరు ప్రభుత్వ అధికారులు, స్థానిక నాయకులు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు తక్షణమే పరిశీలించి మట్టి మాఫియా చేసే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని గిరిజన యువత కోరుతున్నారు.

మట్టి ట్రాక్టర్లతో రోడ్డంతా దుమ్ము, ధూళి

పోలవరం : రాష్ట్ర ప్రభుత్వం కొవ్వాడ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి మట్టి తీసుకుని రైతుల పొలాల్లో వేసుకోవచ్చని అనుమతించిందని మొదలు మట్టి వ్యాపారుల ఆగడాలుకు అంతులేకుండా పోతుంది. రాత్రి పగలు అని తేడా లేకుండా మట్టి ట్రాక్టర్లతో రోడ్లన్నీ నిండిపోతున్నాయి. వాహనాలకు, పాదచారులకు ఈ దుమ్ము కళ్లకు కొట్టి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

పట్టిసీమ కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్ కాలువ పూడికతీత పనుల్లో భాగంగా అధికారులు మట్టి తవ్వి పోస్తుండగా తవ్విన మట్టిని మండలంలో పంటపొలాలు మెరక చేసుకోవడానికి



పోలవరం : మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

రైతులకు అనుమతులు ఇచ్చారు. దీంతో పాత పట్టిసీమ కొవ్వాడ కాలవలో ట్రాక్టర్లతో, జనంతో తీర్థంలా ఉంది. ఊరంతా దుమ్ముమయం అవుతుందని పోలవరం పట్టిసీమ, గూటాల, కొత్త పట్టిసీమ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పొలాల్లో చేరాల్సిన మట్టి గ్రామాల్లో స్థలాలు ఎత్తు పెంచుకోవడానికి, పునాదులు నింపుకోవడానికి వినియోగిస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ దగ్గరగా ఉన్న గ్రామాల్లో రూ.600, దూరంగా ఉన్న గ్రామాలకు రూ.800లకు మట్టిని అమ్ముకుంటున్నారు. ఇరిగేషన్, సంబంధిత అధికారులు ఏం తెలియనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై మట్టి మాఫియాను ఉసిగొలుపుతున్నారు. రోడ్లమీదకు వస్తే ప్రమాదాలు జరుగుతాయనే భయాందోళనలో ప్రజలు ఉన్నారు.

అనుమతుల ముసుగులో కంకర తవ్వకాలు!

సంబంధిత యంత్రాంగం పర్యవేక్షణ కరువు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు ఎర్ర చెరువు గర్భంలో కంకర తవ్వకాలు

అనుమతుల ముసుగులో మండలంలో పలు ప్రాంతాల్లో కంకర తవ్వకాలు యధేచ్ఛగా రేయింబవళ్లు సాగుతున్నాయి. ముఖ్యంగా పోలవరం కాలువ గట్టున గొల్లగూడెం-ప్రకాశరావుపాలెం మధ్యలో కంకర గుట్టలను తవ్వుకునేందుకు మైనింగ్ అధికారులు రెండు వేల క్యూబిక్ మీటర్లకు అనుమతులు ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే ఇచ్చిన దానికన్నా ఎక్కువగానే తవ్వేస్తున్నా సంబంధిత శాఖ పర్యవేక్షణ కొరవడిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. సాధారణంగా ఐదు యూనిట్లు లారీలో అయితే 130 నుంచి 135 ట్రిప్పులతో కంకర తరలిస్తే రెండు వేల క్యూబిక్ మీటర్ల లక్ష్యం పూర్తయినట్టే. అయితే అనుమతిచ్చిన చోట కాకుండా అనధికారికంగా వేరేచోట తవ్వేస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. కంసాలిగుంటలో ఇటీవల పోలవరం గట్టును తవ్వేస్తుండగా గ్రామస్తులు వాహనాలు ఆపి అధికారులకు ఫిర్యాదు చేసినా సరైన చర్యలు తీసుకోలేదు. ఎవరైనా ప్రశ్నిస్తే అనుమతులు ఉన్నాయంటూ ప్రశ్నిస్తున్న వారిపై ఎదురుదాడికి దిగుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఉంగుటూరు పంచాయతీ ఆధీనంలో సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలోని ఎర్రచెరువులో ఎంతో నాణ్యమైన ఎర్రపిక్క కంకర నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. ఎలాంటి అనుమతులూ లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయి. చెరువు అభివృద్ధి కోసం పంచాయతీ బోర్డు తీర్మానం చేసి సాంకేతిక అనుమతుల కోసం జెడ్‌పి సిఇఒకు లెటర్ పంపామని, ఇంకా రాలేదని పంచాయతీ కార్యదర్శి రవికుమార్ వెల్లడించారు. తవ్వకాల విషయం తెలియగానే చెరువును సందర్శించానని, తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తహశీల్దార్ పి.రవికుమార్ చెప్పారు.

వివాదరహిత భూములను సేకరించాలి

స్పెషల్ కలెక్టర్ సరళ వందనం

అధికారులతో సమీక్షిస్తున్న స్పెషల్ కలెక్టర్ వందనం

జీలుగుమిల్లి :మండలంలో పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిమిత్తం భూమికి భూమి సేకరణలో భాగంగా ఎటు వంటి వివాదాలూ లేని భూములను సేకరించాలని స్పెషల్ కలెక్టర్ సరళ వందనం అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో భూసేకరణపై రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కూనవరం మండలంలో నిర్వాసితులకు జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో 500 ఎకరాల వరకు భూమిని సేకరించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా మండలంలోని పూచికపాడు, అంకన్నగూడెం, బర్రింకలపాడు రెవెన్యూ పరిధిలో గిరిజనేతరుల సాగులో ఉండి, ఎటువంటి వివాదాలూ లేని జిరాయతీ భూముల వివరాలివ్వాలని అధికారులను ఆదేశించారు. అట్టి భూముల వివరాలు త్వరలోనే నివేదిక తయారు చేసి ఇవ్వనున్నట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అనంతరం భూసేకరణ ప్రక్రియ మొదలు పెట్టనున్నట్లు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బాలకృష్ణరెడ్డి, వెంకటేశ్వర్లు, విఆర్‌ఒలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ఆ యువకుని లక్ష్యం

దేశవ్యాప్తంగా సైకిల్‌యాత్ర చేపట్టిన వైనం

ప్రజాశక్తి - ముసునూరు

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా తమిళనాడుకు చెందిన ముత్తు సెల్వం అనే యువకుడు దేశ వ్యాప్తంగా సైకిల్ యాత్ర ప్రారంభించాడు. ఈ యాత్రలో భాగంగా గురువారం మండలంలోని వేల్పుచర్ల గ్రామంలోకి చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయ మిత్రులతో మాట్లాడుతూ కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మరణాలను చవి చూడగా, భారతదేశంలో ఆక్సిజన్ అందక ఎంతోమంది చనిపోయిన సంఘటన తన మనసును గాయపరిచిందని, అలాంటి పరిస్థితి భవిష్యత్తులో ఎప్పుడూ ఎవరికీ రాకూడదనే ఉద్దేశంతో పర్యావరణ పరిరక్షణ దిశగా సైకిల్ యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంలో అన్ని రాష్ట్రాల్లో, జిల్లా, మండల, గ్రామ పరిధిలో మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులతో పాటు, సమన్వయ భావం కలిగిన ప్రతిఒక్కరూ తనను అభినందించడం చాలా గర్వంగా ఉందన్నారు. ఇలాంటి లక్ష్యంతో ఇంతటి భారీ సైకిల్ యాత్ర చేపట్టిన వారు ఎవరూ లేరని, ఇది ఒక గొప్ప రికార్డుగా సృష్టించబడుతుందని తెలిపారు. ప్రతి అంశం, ప్రతి ప్రాంతం తమ కెమెరాలో బంధిస్తూ అన్ని ప్రాంతాల్లో పత్రికల్లో ప్రచురితమైన వార్త కథనాలను రికార్డ్ చేస్తున్నట్లు చెప్పారు. తమ సొంత ఖర్చులతో యాత్ర కొనసాగిస్తున్నట్లు చెప్పారు. సైకిల్ వెనుక భాగంలో ఉన్న బాక్సులో ఫస్ట్ ఎయిడ్ కిట్టు, కుకింగ్ కిట్టు ఉంటాయని, ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటలకు వరకు సైకిల్ యాత్ర కొనసాగిస్తూ, దేవాలయాల్లో లేదా పెట్రోల్ బంకు పరిసర ప్రాంతాల్లో బస చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు అధికారులు, పాత్రికేయులు చేసిన సహాయ సహకారాలు ఎన్నటికీ మరువలేనని తెలిపారు.

తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్య

ఏలూరు పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ సోమ సుధాకర్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తమ పాఠశాలలో తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామని ఏలూరు పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ సోమ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. అందరికీ నాణ్యమైన విద్యను అందిస్తూ ఐట్టి చదువులకు పునాది పలికే విధంగా పిల్లలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఏలూరు పబ్లిక్ స్కూల్‌ను ఏలూరులోని ఆర్ఆర్.పేట ఈదరవారి రోడ్డులో నిర్వహిస్తున్నామని తెలిపారు. అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయిస్తున్నామన్నారు. కంప్యూటర్ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాథమిక విద్య నుంచి సైన్స్ కొన్ని ప్రాజెక్టు పనుల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించేవిధంగా కృషి చేస్తున్నామన్నారు. కమ్యూనికేషన్స్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ విధానం కోసం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. వ్యాస రచన, ఉపన్యాసం, చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. డ్యాన్స్ పాటలతో కూడిన విద్యాబోధన చేస్తున్నామన్నారు. బాలికలు ఎటువంటి పరిస్థితులెదురైనా తమను తాము రక్షించుకునే విధంగా కరాటే శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తమ వద్ద ఎల్‌కేజి నుంచి పదో తరగతి వరకు విద్యాబోధన చేస్తున్నామని, ఆరో తరగతి నుంచి ఐఐటి విధానంలో బోధిస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి సెకండ్ క్లాస్ వరకు ఏసి తరగతి గదులు ఉన్నాయని చెప్పారు. మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధనలు జరుగుతున్నాయన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వం, ఆత్మస్థైర్యం, జ్ఞానం పెంపొందించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఏలూరు పబ్లిక్ స్కూల్లో విద్యార్థులను చేర్చి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని డైరెక్టర్ సోమ సుధాకర్ కోరారు.

డైరెక్టర్ సుధాకర్

ఏలూరు పబ్లిక్ స్కూల్ భవనం

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని తెడ్లం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొమ్మంటి సత్యవతి కుటుంబానికి గ్రామానికి చెందిన కేతిరెడ్డి సీతా రామిరెడ్డి చంద్ర కాంతమ్మ కుమారుడు కేతిరెడ్డి వీరారెడ్డి (చినబాబు), తెడ్లం సర్పంచి ముప్పన స్రవంతి రమేష్ రెడ్డిలు గురువారం ఆర్థిక సహాయం అందించారు. ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ సాయం అందించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలన్నారు.

థియేటర్లలో తహశీల్దార్ తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సినిమా టికెట్లను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని నూజివీడు తహశీల్దార్ బద్రు ఆదేశించారు. పట్టణంలోని ద్వారక, తిరుమల, సత్య నారాయణ, మినీ సత్యనారాయణ, థియేటర్లను గురువారం తనిఖీ చేశారు. ఫైర్ సేఫ్టీ విషయంలో థియేటర్లు తప్పనిసరిగా జాగ్రత్తలు, నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. థియేటర్లలో తినుబండరాలు ఎంఆర్‌పికే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సుబ్బారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, అటెండర్ మస్తాన్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : తనిఖీ చేస్తున్న తహశీల్దార్

ఏలూరు సిటీ : ఏలూరులోని సాయి బాలాజీ, సత్యనారాయణ థియేటర్లను ఏలూరు తహశీల్దార్ శేషగిరిరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు థియేటర్లు తనిఖీ చేశామని తెలిపారు. థియేటర్లకు లైసెన్స్‌లు ఉన్నాయని, థియేటర్లు మొత్తం పరిశుభ్రంగానే ఉన్నాయని, టాయిలెట్స్ శుభ్రంగానే ఉన్నాయని, మౌలిక సదుపాయాలు ఉన్నాయని, రేట్ల పట్టిక ద్వారానే తినుబండారాలను అమ్ముతున్నారని తెలిపారు. సత్యనారాయణ థియేటర్లో మాత్రం డ్రింకులపై పది రూపాయలు అధిక ధర వసూలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. దీనిపై నివేదికను తయారుచేసి కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

మహిళకు పెన్షన్ వచ్చేనా...!

ప్రజాశక్తి - చింతలపూడి

భర్త మృతి చెందడంతో అతనికొచ్చే పెన్షన్ తనకు ఇప్పించాలని కోరిన మహిళకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పింఛన్ రాదని అధికారులు చెప్పారు. పెన్షన్ ఇప్పించండి సారూ..! శీర్షికన గురువారం ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. నిర్దేశించిన నెల, సంవత్సరం 2023 డిసెంబర్ ఒకటో తేదీ నాటి నుంచి మరణించిన భర్త పెన్షన్ భార్యకు స్పౌజ్ పెన్షన్ అర్హత ప్రకారం నిర్దేశిత డాక్యుమెంట్ అప్‌లోడ్ చేయడం ద్వారా ప్రభుత్వం వారు పెన్షన్ మంజూరు చేస్తున్నారు. కాని అర్జీదారురాలైన మారుమూడి మార్తమ్మ భర్త వీరయ్య 2023 డిసెంబర్ ఒకటో తేదీ నాటికి ముందుగానే 2023 అక్టోబర్ ఆరో తేదీన మృతి చెందాడని, దీంతో స్పౌజ్ పెన్షన్ ఆన్‌లైన్ చేయడం తీసుకోవడంలేదని తెలిపారు. స్పౌజ్ పెన్షన్ మంజూరై లేదని అధికారులు తెలిపారు. కాని ఆమెకు వింతంతు పెన్షన్ ఇస్తారా, ఇస్తే ఎప్పుడు ఇస్తారు, పెన్షన్ ఆమెకు వస్తుందా, ఆమె ఎటువంటి పెన్షన్‌కు అర్హురాలు అనే సందేహాలపై అధికారులు సరైన వివరణ ఇవ్వకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

సుగర్ ఫీట్ మాయాజాలం

పోలీసులకు బాధితుని ఫిర్యాదు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ఎస్.రాంబాబు అనే వ్యక్తి సోషల్ మీడియా వేదికలపై వచ్చిన ఆకర్షణీయమైన ప్రకటనలను చూసి షుగర్ ఫిట్ అనే డివైస్‌ను బజాజ్ ఫైనాన్స్ ద్వారా రూ.18 వేలకు కొనుగోలు చేశారు. ఈ డివైస్ గురించి ప్రకటనల్లో చెప్పిన వివరాల ప్రకారం చేతికి స్ట్రిప్ వంటి పరికరాన్ని ధరించడం ద్వారా రోజువారీ షుగర్ స్థాయిలను సెల్‌ఫోన్‌లో చూడవచ్చని, షుగర్ స్థాయి పెరిగినప్పుడు అలర్ట్ ఇస్తుందని, ఔషధాలు, ఆహార నియమాల గురించి సూచనలు అందిస్తుందని, అలాగే ప్రతి వారం డాక్టర్ సంప్రదింపులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఆకర్షణీయ వాగ్దానాలతో ఆకర్షితుడైన రాంబాబు ఈ పరికరాన్ని ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశారు. అయితే కొనుగోలు చేసిన ఈ డివైస్ పనిచేయకపోవడంతో రాంబాబు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ విషయాన్ని షుగర్ ఫిట్ సంస్థకు తెలియజేయగా, పరికరాన్ని తిరిగి తీసుకోవడానికి సంస్థ రెండు నెలల సమయం తీసుకుందని, ఈ ప్రక్రియలో కస్టమర్ కేర్ సరైన స్పందన ఇవ్వలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా బజాజ్ ఫైనాన్స్‌కు నెలకు రూ.1,500 చొప్పున చెల్లిస్తున్నప్పటికీ, పరికరాన్ని తిరిగి ఇవ్వడం గాని, డబ్బులు రీఫండ్ చేయడం గాని జరగలేదని ఆయన వాపోయారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పాలస్తీనా ముఖచిత్రం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతు కూలీ సంఘం ప్రచురించిన 'పాలస్తీనా ముఖచిత్రం' పుస్తకాన్ని గురువారం స్థానిక స్ఫూర్తి భవన్‌లో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎంఎస్.నాగరాజు ఆవిష్కరించి మొదటి పుస్తకాన్ని డాక్టర్ రావి గోపాలకృష్ణయ్యకు అందించారు. సభకు ముఖ్య వక్తగా విచ్చేసిన రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నాజీల బారి నుంచి, ఫాసిస్టుల నుంచి రక్షణ పొందేందుకు ఆశ్రయం కోసం వచ్చిన యూదులు, ఏకంగా నీడ నిచ్చిన చెట్టునే దురాక్రమణ చేశారని ఇజ్రాయెల్‌పై ధ్వజమెత్తారు. అమెరికా అండదండలతో, సామ్రాజ్యవాద దేశాల కనుసన్నలతోనే ఇజ్రాయెల్ పాలస్తీనాపై దురాక్రమణ యుద్ధం చేస్తుందన్నారు. ప్రపంచాన్ని శాసించే, యుద్ధాలను సృష్టించి, కనుసైగతో నిలుపుదల చేసే అమెరికా ఇజ్రాయిల్ గాజాపై చేసే దాడులను ఎందుకు నియంత్రించటం లేదని ప్రశ్నించారు. సామ్రాజ్యవాద దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు, పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలవాలన్నారు. ఈ సభకు రైతు కూలీ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.బాషా అధ్యక్షత వహించగా పిడిఎస్‌ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాలకు చెందిన రైతు కూలీలు, ఆదివాసీలు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బండివారిగూడెంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ ఎం.జయబాబు తన సిబ్బందితో గురువారం పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2130 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చింతలపూడి : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ డాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.65,500 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కొల్లేరు అభయారణ్యంలో తవ్వకాలు అడ్డగింత

ప్రజాశక్తి - దెందులూరు

ంండలంలోని మానూరు గ్రామం శివారు హరిపురం కొల్లేరు అభయారణ్యంలో రహస్య తవ్వకాలను అటవీ శాఖాధికారులు అడ్డుకున్నారు. ఎంఎల్‌ఎ మనిషిని అని నమ్మ పలికించి చేపల చెరువులు తవ్వుతుండగా ఫారెస్ట్ అధికారులు విషయం తెలుసుకుని సకాలంలో చెరువు దగ్గరకు వెళ్లి, మెషిన్‌తో గట్లను ధ్వంసం చేశారు. కొల్లేరు అభయారణ్యం పరిధిలో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

31న 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ ఏలూరు రాక

ప్రజాశక్తి - ఏలూరు

20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ ఈ నెల 31వ తేదీ శనివారం ఉదయం 8.30 గంటలకు ఏలూరు రెవెన్యూ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో 20 సూత్రాల కార్యక్రమం అమలుపై అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు పాత్రికేయుల సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు భోజన అనంతరం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు స్థానిక కూటమి నాయకులతో సమావేశం అవుతారు. సాయంత్రం ఆరు గంటలకు ఏలూరు నుంచి బయలుదేరి విజయవాడ వెళతారు.

వివాదాలు లేకుండా భూ సేకరణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపునకు గురవుతున్న సీతారామరాజు జిల్లా కూనవరం గ్రామ నిర్వాసిత ప్రజలకు భూమికి భూమి, ఇల్లు నిర్మాణం కోసం భూ సేకరణ బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో జరుగుతుంది. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ సరళ వందన, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, చింతూరు డిప్యూటీ కలెక్టర్ బాలకృష్ణారెడ్డి భూ సేకరణ అధికారులతో కలిసి మండలంలోని సూరప్పవారిగూడెం, రెడ్డి గణపవరం గ్రామాల్లోని భూ సేకరణ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సుమారు 300 ఎకరాల భూమిని గుర్తించామని, ఎటువంటి వివాదాలు లేని భూమినే సేకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుట్టాయగూడెం తహశీల్దార్ చలపతిరావు, మండల సర్వేయర్, ఆర్ఐ సీనియర్ అసిస్టెంట్ గంగరాజు, విఆర్ఒలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూన్ రెండో తేదీన మండల కార్యాలయాల వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కొయ్యలగూడెంలో ముఠా కార్మికులతో కలిసి గురువారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ పట్టణాల్లో రెండు సెంట్ల భూమి, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల భూమి ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ప్రభుత్వం మంజూరు చేయాలని, కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలగల నాని, మట్ట రామకృష్ణ, ముప్పిడి ఏసు, అయినపర్తి మహేష్, వెలగల రామారావు, పులపాకుల రాంబాబు, మల్లిపూడి చిన్న, గోపాలం, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు

వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు గురువారం 27వ రోజు కొనసాగాయి. ముందుగా గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులకు మానసిక ప్రశాంతత, మేధాశక్తి పెంపొందించడానికి, శరీరానికి యోగా ఎంతో అవసరమని తెలుపుతూ యోగాసనాలు వేయించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్ జివి.ఆనందరావు విద్యార్థులకు బంగారు గొడ్డలి- నిజాయితీకి బహుమతి అనే నీతి కథలను బోధించారు. కథలో నీతిని విద్యార్థులకు వివరించారు. రిసోర్స్ పర్సన్ ఐ.శ్రీనివాసరావు విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ పోటీలను నిర్వహించారు. విరామంలో చిన్నారులకు స్నాక్స్ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి.సందీప్ కుమార్, ఎండి.అస్లాం పాషా, ఎం.కనకదుర్గ పాల్గొన్నారు.

రేషన్ వాహనాల ఆపరేటర్లు, అసిస్టెంట్లను కొనసాగించాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

ప్రజా పంపిణీ వ్యవస్థలో వినియోగదారుల ఇంటికి నేరుగా సరుకులు సరఫరా చేస్తున్న మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్లు (ఎండియు)లను జూన్ ఒకటో తేదీ నుంచి నిలిపేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించి ఆపరేటర్లు, అసిస్టెంట్లను కొనసాగించాలని సిఐటియు కుక్కునూరు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో 9,260 మొబైల్ వాహనాల ద్వారా కోట్లాది మంది లబ్ధిదారులకు ఇంటికే సరుకులు చేరవేస్తున్నారని తెలిపారు. ఈ వాహనాలపై ఆధారపడి ఆపరేటర్లు, అసిస్టెంట్లు 18,520 మంది ఉన్నారని తెలిపారు. ఒక్కో వాహనాన్ని రూ.5.75 లక్షలకు బ్యాంకు నుంచి ప్రభుత్వం ఆపరేటర్‌కు రుణం కింద ఇప్పించిందని, ప్రతినెలా ఆపరేటర్లు రూ.మూడు వేలు ఇఎంఐ కింద చెల్లిస్తున్నారని తెలిపారు. వీరి సేవల మూలంగా లబ్ధిదారులు, డీలర్లు షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం లేకుండా పోయిందని పేర్కొన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఉపాధి కోల్పోకుండా వారికి ఈ మొబైల్ వ్యవస్థ తోడ్పడిందని తెలిపారు. వృద్ధులు, వికలాంగులకు ఏజెన్సీ ప్రాంతాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. ఈ వ్యవస్థను రద్దు చేస్తే 18,520 మంది వీధినపాలయ్యే ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎండియు వ్యవస్థను కొనసాగించాలని పేర్కొన్నారు. అధికారంలోకొస్తే ఎవర్నీ ఉద్యోగాల నుంచి తొలగించబోమని తొలుత చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ముందస్తు నోటీసులుగానీ, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించకుండా ఆపరేటర్లు, అసిస్టెంట్లను తొలగించడం అన్యాయమని తెలిపారు.

ఆదాయ పన్ను శాఖకు రిటర్న్స్ దాఖలు చేయాలి

ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ ప్రతాప్ సింగ్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సహకార సంఘాలు, సేవా సంఘాలు ఆదాయ పన్ను శాఖకు క్రమం తప్పకుండా రిటన్లు దాఖలు చేసి సహకరించాలని ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ ప్రతాప్ సింగ్ భుక్య కోరారు. స్థానిక డిసిఎంఎస్ గ్రాండ కన్వెన్షన్ హాలులో జిల్లా కో-ఆపరేటివ్ కార్యదర్శులు, పర్సన్ ఇన్‌ఛార్జులతో ఒక్కరోజు అవగాహనా సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 158 కో-ఆపరేటివ్ సహకార సంఘాల్లో 155 సంఘాలు పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ అవ్వడం శుభపరిణామమన్నారు. మిగతా మూడు కో-ఆపరేటివ్ సహకార సంఘాలు కూడా కంప్యూటరీకరణ చేయాలని సూచించారు. ఆదాయపన్ను శాఖ లాగిన్ ద్వారానే ఆదాయ పన్ను రిటన్లు దాఖలు చేయాలని, మాన్యువల్‌కు అవకాశం లేదని, పాత పద్ధతులకు స్వస్తి చెప్పాలని స్పష్టం చేశారు. కో-ఆపరేటివ్ సహకార సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు పొందాలంటే ఆదాయపన్ను శాఖకు రిటన్లు దాఖలు చేసి ఎటువంటి పెండింగులు, బకాయిలు లేకుండా చూసుకోవాలన్నారు. ఆదాయపన్ను శాఖ నియమ నిబంధనలను వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవాలని, సహకార సంఘాలు మంచి ఆడిటరును నియమించుకోవాలని సూచించారు. ఆదాయపన్ను శాఖ నుంచి నోటీసులు వస్తే వెంటనే ఆడిటరును సంప్రదించాలని, అశ్రద్ధ చేస్తే ఎన్నో ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు. జిల్లా సహకార శాఖాధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి కో-ఆపరేటివ్ సహకార సంఘం ఆదాయపన్ను రిటన్లు దాఖలు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఆదాయపన్ను శాఖాధికారి షేక్ అబ్దుల్ ఖయాం, డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి పి.త్రినాథ్, ఆడిటరు ఆర్.రాధాకృష్ణ, జిల్లా కో-ఆపరేటివ్ సహకార సంఘాల కార్యదర్శులు, పర్సన్ ఇన్‌ఛార్జులు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం : కలెక్టర్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ద్వారకాతిరుమలలోని హరిత హోటల్ వద్ద జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఆర్‌డిఒ రమణ, ప్రజలతో కలిసి ఆమె యోగాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరూ ఒత్తిడితో కూడిన జీవనం గడుపుతున్నారని, యోగా ద్వారా మానసిక, శారీరక దృఢత్వం కలుగుతుందని, యోగాను ప్రతిఒక్కరూ వారి జీవనశైలిలో భాగంగా చేసుకోవాలన్నారు. గ్రామ, వార్డుస్థాయిలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు, మండలస్థాయిలో జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు, జిల్లాస్థాయిలో జూన్ 9 నుంచి 14వ తేదీ వరకు యోగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 16 నుంచి 18 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటా యన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు స్థానిక సచివా లయాల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్ర మంలో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ రమణ, డిఎంహెచ్ఒ డాక్టర్ మాలిని, పర్యాటక అభివృద్ధి అధికారి పట్టాభిరామయ్య, తహశీల్దార్ సుబ్బారావు, ఎంపిడిఒ ప్రకాష్, యోగా శిక్షకులు జి.విజయలక్ష్మి, సిహెచ్.శివ, కె.వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ ఎన్నికలు జరిగేనా..!

అభివృద్ధికి బాటలు పడతాయని చింతలపూడి ప్రజల ఆశ

ఛైర్మన్ పదవి కోసం ఆశావాహుల కసరత్తు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధిలో వెనుకబడి ఉంది. పేరుకే నగర పంచాయతీ అని కాని ఆ మేరకు అభివృద్ధి లేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. నగర పంచాయతీ ఎన్నికలు జరిగితే అభివృద్ధి ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఆ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో, అభివృద్ధి ఎప్పుడు జరుగుతుందోనని ప్రజలు ఎదురుచూస్తునే ఉన్నారు. 2020 డిసెంబర్‌లో చింతలపూడి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయింది. అప్పటి నుంచి ఏ అభివృద్ధి లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్డుపై వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చింతలపూడి నగర పంచాయతీలో 20 వార్డుల్లో దాదాపు 30 వేల మంది వరకు జనాభా ఉన్నారు. నగర పంచాయతీ ఎన్నికలు జరిగితే అభివృద్ధికి బాటలు పడతాయని ప్రజలు భావిస్తున్నారు. పన్నులు వసూలు చేస్తున్నా అభివృద్ధి మాత్రం జరగడంలేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. నగర పంచాయతీలో సరైన రోడ్డు లేక, వైఎస్ఆర్ కాలనీలో తాగునీరు లేక, రోడ్ల ఆక్రమణలు పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు.

నగర పంచాయతీ ఎన్నికలపై ఆశావాహుల కసరత్తులు

చింతలపూడి నగర పంచాయతీ ఎన్నికలపై ఆశావాహులు ఇప్పటినుంచే కసరత్తులు ప్రారంభిస్తున్నారు. నగర పంచాయతీ ఛైర్మన్ పదవి కోసం పోటీ నెలకొంది. ఏ సామాజిక తరగతికి కేటాయిస్తారో తెలియక సతమతమవుతున్నారు. కాపు, ఆర్యవైశ్యులు, కమ్మ సామాజిక తరగతుల నుంచి పోటీ ఎక్కువగా ఉంది. చింతలపూడి నగర పంచాయతీలో వీరి జనాభా బలంగా ఉండడంతో నగర పంచాయతీ ఛైర్మన్ పదవులు ఆశిస్తున్నారు.

జనసేనకు నగర పంచాయతీ పగ్గాలు అప్పగిస్తారా?

చింతలపూడి నగర పంచాయతీ ఛైర్మన్ పదవి కోసం జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన నామినేటేడ్ పదవుల్లో పెద్దగా పోటీ పడకపోయినా, నగర పంచాయతీ ఛైర్మన్ పదవి తనకి కావాలని ఇప్పటికే పార్టీ పెద్దల మధ్య పెట్టినట్లు తెలుస్తుంది. చింతలపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు చేసినా టిడిపి నుంచి గట్టి పోటీ ఇవ్వడం పెద్దల సూచనల మేరకు అవకాశం ఉంటే ఇవ్వండని, లేకపోతే నగర పంచాయతీ ఛైర్మన్ పదవి ఇవ్వండని చెప్పినట్లు తెలుస్తుంది. నియోజకవర్గంలో, మండలంలో జనసేన పార్టీని బలోపేతం చేయడానికి మధుబాబు తీవ్రంగా కష్టపడ్డారని ఆ పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. 2024 ఎన్నికల్లో ఎంఎల్‌ఎకు అత్యధిక మెజార్టీ రావడంలో జనసేన పార్టీ తరపు నుంచి కీలక పాత్ర పోషించారని పలువురు అంటున్నారు. పార్టీ కార్యకర్తలు ఆపదలో ఉన్నప్పుడు వారికి ఆర్థికంగా సాయం చేయడమే కాకుండా, ఆ కుటుంబానికి భరోసా ఇచ్చే వ్యక్తి అని చెబుతున్నారు. యువకుడని, ఇంకా రాజకీయ పరిజ్ఞానం కావాలని, రాజకీయ చదరంగంలో ఆచితూచి అడుగులు వేయాలని ఆయనకు కొందరు సూచనలు చేస్తున్నారు. అంతేకాకుండా వైసిపి నుంచి కాపు సామాజిక తరగతికి చెందిన వ్యక్తిని పోటీలోకి తీసుకొస్తారని ప్రచారం జరగడంతో నగర పంచాయతీ ఛైర్మన్ మధుబాబుకు అవకాశం కల్పించాలని అభిప్రాయపడుతున్నారు. చింతలపూడి నగర పంచాయతీలో కాపు సామాజిక తరగతి ఓట్లు ఎక్కువగా ఉండటంతో వైసిపి నుంచి బలమైన అభ్యర్థిని బరిలోకి దించాలని వైసిపి అధిష్ఠానం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది. టిడిపి నుంచి కూడా నుంచి ఆశావాహులు సంఖ్య ఎక్కువగానే ఉంది. ఎప్పటి నుంచో పార్టీ కోసం పని చేస్తున్నామని, తమకు సీటు కేటాయించాలని పోటీ పడుతున్నారు. ఆర్యవైశ్య సామాజిక తరగతి నుంచి కూడా పోటీ ఉంది. ఏ సామాజిక తరగతికి సీటు కేటాఇస్తారో తెలియక అందరూ నగర పంచాయతీ ఎన్నికల గురించి ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రకటించిన మద్దతు ధర రైతులను మరోసారి నిరాశపరిచిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వరితో సహా 14 పంటలకు మద్దతు ధర ప్రకటించిందని, ఇది ఏమాత్రం రైతాంగానికి ఆమోదయోగ్యం కాదని, కేవలం కంటి తుడుపు చర్య అని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సి-2 ప్లస్ 50 శాతం ఆధారంగా మద్దతు ధరలు ప్రకటించాలని పేర్కొన్నారు.

CHANGE OF NAME

I, **BUSI JAGAN MOHAN RAO,** S/o. Nakshatra Rao, D.No: 11-6-43, Gandhinagar-2, Narasapuram, West Godavari Dist., Pin-534275 changing my name **BUSI JAGAN MOHANA RAO,** (old name) to **BUSI JAGAN MOHAN RAO** (new name) Hence forth Iam being called as **BUSI JAGAN MOHAN RAO** (new name) for all purposes.

CHANGE OF NAME

I, **BODDU VIJAYA SWAMY** S/o Boddu Samba Murthy, D.No. 8-4-138, Patapadu,, Kalipatnam Post, Mogaltur Mandal, W.G.Dt. A.P. I have changed my name from **BUDDU VIJAYA SWAMY** (Old name) to **BODDU VIJAYA SWAMY** (New name) hence forth I am being called **BODDU VIJAYA SWAMY** S/o Boddu Samba Murthy for all purposes.

పేరు మార్పు ప్రకటన

మద్దా చిన్నిరావు (కొత్తపేరు) తండ్రి: మద్దా దావీదు, డోర్ నెం. 4-12/1, చిన్నగరువు, తుందుర్రు, భీమవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ (ఇండియా) నందు నివసించుచున్నాను. ఇప్పుడు నా పేరును మద్దా చిన్నారావు (పాతపేరు) తండ్రి: మద్దా దావీదు నుండి మద్దా చిన్నిరావు (కొత్తపేరు) తండ్రి: మద్దా దావీదుగా మార్చుకున్నాను. ఈరోజు నుండి అదుపరి అన్ని లావాదేవీల కోసం నా కోసం నా కొత్తపేరును ఉపయోగించవలెను.

మద్దా చిన్నిరావు, S.o. దావీదు
డోర్ నెం. 4-12/1, తుందుర్రు,
భీమవరం మండలం, ప॥గో॥జిల్లా.

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఏలూరు నగరం, కల్పన థియేటర్ దగ్గర, డోర్ నెం. 4-19-5/1, రు కాపురస్తులు బెల్లంకొండ ఉదయ్ కుమార్, తండ్రి: సత్యనారాయణ అను నా యొక్క ఒరిజినల్ లింక్ దస్తావేజులు పడిపోయినవి. ఏలూరు ఆర్.సి.లో 1వ పుస్తకం **దస్తావేజు నెం: 238/1993** ది. 11-01-1993వ తేదీన రిజిస్టర్ కాబడి ఉన్నాయి. సదరు ఒరిజినల్ దస్తావేజులు ది. 20-05-2025వ తేదినాడు మా ఇంటి వద్దనుండి పెద్ద పోస్ట్ ఆఫీస్ సమీపములో జిరాక్స్ తీయుంచుకునేందుకు వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. ఎంత వెతికిన దొరకలేదు. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

బెల్లంకొండ ఉదయ్ కుమార్
S/o. సత్యనారాయణ,
కల్పన థియేటర్ దగ్గర, డోర్ నెం: 4-19-5/1,
పాతమార్కెట్, ఏలూరు, ఏలూరు జిల్లా,
సెల్: 98484 68685

ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) భీమడోలు, పశ్చిమ గోదావరి జిల్లా వారి కోర్టులో

O.S.No. 10/2022

Between:

మోరు సాయి ప్రసన్న @ బలే సాయి ప్రసన్న మరియు యింకొకరు ...వాదులు

మరియు

బలే గౌరీశంకరరావు మరియు వగైరాలు ...ప్రతివాదులు

To,

D-3 : సైదు త్రిమూర్తులు, **S/o.** నరశింహారావు, ఆగడాలలంక, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా- 534427.

D-4 : బలే శశికళాదేవి, **D/o.** లక్ష్మీనారాయణ (లేటు), డోర్ నెం. 5-142, ఆగడాలలంక, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా- 534427.

పై నంబరు దావా గ్రంథములో వాదులు అయిన మోరు సాయి ప్రసన్న @ బలే సాయి ప్రసన్న మరియు బలే లక్ష్మీ ప్రసన్న అను వారు మీ మీద పైన తెల్పిన కోర్టు వారి ఎదుట దావా షెడ్యూలు ఆస్థిని వాటాల విభజన కొరకు దావా దాఖలు చేసినందున మీకు పై కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపించినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రికా ముఖంగా సమన్లు అమలుకు ఆర్డరు అయి వున్నది. కావున వాయిదా **ది.20-06-2025**వ తేదిన **ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.

G.V. Nageswara Rao,
M. Kedari,
K.V. Satyanarayana
వాది తరపు న్యాయవాదులు
ఏలూరు
Cell: 94409 88449

ఏలూరు
29-05-2025